
# అసూయ

మాదిరెడ్డి సులోచన



అసూయ ముందుపుట్టి ఆడవాడు తరువాత పుట్టారని అంటారుగాని నిజంగా ఆలోచిస్తే అసూయకు ఆడా- మొగా డిగ్రీలతో నిమిత్తం లేదు. ఉద్యోగరీత్యా కెన్యా వెళ్లాల్సి వచ్చింది. నైరోబిలో ప్లేన్ దిగాను. అధికారులువచ్చి రిసీవ్ చేసుకున్నారు. హోటల్లో వసతి ఏర్పాటు చేశారు కెన్యాలో మన మిఠాయిలు జిలేబి రసగుల్లా అన్నీ లభిస్తాయి. ఆకలికి చావనులే అనుకున్నాను. ప్రపంచ ఖ్యాతి గాంచిన కెన్యా నేషనల్‌పార్క్ చూడాలనిపించింది. హోటల్లో మేనేజరుతో మాటాడి టాక్సీ చేయించుకుని వెళ్ళాను. ఒకవైపు భగవంతుని సృష్టిఅయిన అడవి రెండోవైపు మానవుని సృష్టి అయిన పూదోట. వాటిలో స్వేచ్ఛగా తిరుగాడే జంతువులు, సింహాలు, పులులు చిరుత, దుప్పి జీబ్రా ఆస్ట్రిచ్ ఒకటేమిటి సమస్త జంతువులు చూడ ముచ్చటగా ఉన్నాయి.

'అంటీ కారు దిగుదాము." చిన్న కుర్రవాడి తీయని గొంతు వినిపించింది. ఎడారిలో నీరు దొరికినట్టు ఫీలయ్యాను. యెవరో తెలుగు మాట్లాడే వారు లభించారు. ప్రక్కకుచూచాను ఓ పాతికేళ్ళ స్త్రీ కారు స్టీరింగ్‌ముందు కూర్చుంది ప్రక్క సీట్లో అయిదేళ్ళ అబ్బాయి కూర్చున్నాడు అందం కంటే, ఆమె అలంకరణ. ఆమెకు ఆకర్షణ తెచ్చిపెట్టిందంటే అతిశయోక్తి కాదేమో

"ఇకవెళ్దాం చిన్నా!" ఆమె గొంతు వినిపించింది. ఆలస్యం చేస్తే ఆవిడ వెళ్ళిపోతుందేమోనని గ్లాసుయెత్తి మాట్లాడాను.

'ఏమండి మీరు యెక్కడుంటారు?" నా ప్రశ్నకు ఆమె తెల్లబోయింది. కొత్తవాడిని చేసిన చొరవకో లేదా తెలుగువారున్నారని సంతోషమో

"ఇక్కడ మాట్లాడడం కుదరదు మీరు ఎక్కడున్నారో చెప్పండి' అన్నాను.

'మా అడ్రసు చాలా గందరగోళం. మీరెక్కడుంటారో చెప్పండి?' నా హోటల్‌పేరు చెప్పాను. ఆమె కారు కదిలింది వెంటనే నా టాక్సీ కదిలింది ఆమె హోటల్‌ముందు కారుపార్క్ చేసి నిల్చింది. ఆమె చేయిపట్టుకుని కుర్రవాడు దిక్కులు చూస్తున్నాడు.

'ఇప్పుడే వచ్చారా?" అన్నాను. నా టాక్సీ కొస్త నెమ్మదిగా చుట్టుతిరిగి వచ్చింది.

'అవునండీ క్రొత్త వారిలా ఉన్నారే?" అన్నది చిన్నగా నవ్వుతూ.

'అదేమిటండీ నా ముఖాన క్రొత్తవాడి నని రాసి ఉందా?"

'అదికాదులెండి. పాతవారు తోటి భారతీయులను పలకరించేందుకు సాహసించరు లెండి." అన్నదామె ఆమె నవ్వుకు పలువరస బయట పడింది.

'అంటీ! కూల్‌డ్రింకు...' అబ్బాయి మారాం మొదలు పెట్టాడు.

'రండి గదిలోకి వెళ్ళి మాట్లాడుకుందాం." నా వెంట వారిద్దరూ వచ్చారు బోయ్‌ను పిలిచి కూల్ డ్రింక్స్ తెప్పించాను.

చెప్పండి మీరు యెక్కడుంటారు?" ఆమె తన అడ్రసు చెప్పింది.

'దేశంకాని దేశంలో మనవారిని చూస్తే ప్రాణం లేచివచ్చిందంటే నమ్మండి' అన్నాను

'సహజమేగా మీకు పోస్టింగ్ యిక్కడే అయిందా?"

'ఉండటము ఇక్కడే రూరల్ ఏరియాలో స్టడీ టూర్స్ అప్పుడప్పుడు చేయాలి, మీ రెన్నాళ్ళయింది వచ్చి?"

'ఒకటిన్నర సంవత్సరము అవుతుంది. అన్నయ్య ఇక్కడే వ్యాపారం చేస్తూ ఉండిపోయాడు మూడేళ్ళక్రితం వచ్చినప్పుడు వదిన రమ్మని- మరీ మరీ చెప్పింది. నేను వచ్చే సరికే వదిన జబ్బుతో తీసుకుంటూంది నేనువచ్చిన రెండు నెలలకు ఆమె మరణించింది. వీడు ఒంటరివాడు అయిపోయాడు' బాధగా పిల్లవాడి వీపు నిమిరింది.

'సారీ..." అన్నాను ఏమనాలో తెలియక.

'అన్నయ్య ఒంటరివాడు అయిపోయాడు. కాలక్షేపానికని దగ్గరేవున్న మిషన్ స్కూల్‌లో పని చేస్తున్నాను. ఈ సంవత్సరాంతమున చిన్నాని తీసుకుని వెళ్ళిపోదాం అనుకుంటున్నాను. అమ్మ అన్నయ్యను పిల్చుకురమ్మని రాసింది రెండో వివాహానికి ప్రయత్నిస్తారో ఏమో!" అన్నది. నేను నా వివరాలు చెప్పాను.

'పదండి మా యింటికి దగ్గరలోనే అద్దెయిళ్ళు దొరుకుతాయి. ఒంటరి పురుషులు హోటల్లో యెక్కువ రోజులుంటే మంచిదికాదు." నవ్వింం

దామె. ఆమె వెనకాలే వెళ్ళి కార్లో కూర్చున్నాను. మొదట కారు మెయిన్ రోడ్డుకో ఉన్న పెద్ద బిల్డింగ్ ముందు ఆగింది.

'రండి అన్నయ్యతో చెప్పి వెళ్ళిపోదాం." అందరము లోపలికి వెళ్ళాం. టెలిఫోన్ దగ్గర ఓ ముప్పై అయిదేళ్ళ వ్యక్తి నిల్చుని మాటాడుతున్నాడు. గ్రే కలర్ సూటులో హుందాగా కనిపిస్తున్నాడు పోలికలనుబట్టి అతనే ఆమె అన్నగారని గ్రహించాను

'అన్నయ్యా! వీరు..." నా పేరు అడగలేదంటవరకు మధ్యలో ఆగిపోయింది

'మిస్టర్ లక్ష్మణ్" నాకు నేనే గౌరవమిచ్చినట్లు పరిచయము చేసుకున్నాను

"ఓ! ఐయామ్ గోపాల్. ఈమె నాచెల్లెలు సునంద' ఆయన తమాషాగా పరిచయము చేశాడు.

"నిజమే అన్నయ్యా! నాకు మతిమరుపు యెక్కువ అవుతూంది. నా పేరు చెప్పలేదు .."

'మరి నా పేరో " చిన్నా ముందుకు వచ్చాడు

'వీడు మాష్టర్ ఉదయకుమార్." సునంద అన్నది.

నువ్వు వెళ్ళి అతనికి కావల్సిన ఏర్పాట్లు చూడు నందా. నేను అరగంటలో వచ్చేస్తాను." గోపాల్ చెప్పారు. అబ్బాయితో ఇరువురమూ ఇల్లు చేరాం. సునంద ప్రతిపనిలో ప్రవీణురాలు కమ్మని భోజనము కొసరి కొసరి తినిపించింది. నిముషాలమీద గది ఏర్పాటయింది.

మర్నాడు గోపాల్‌తోవెళ్ళి ఇల్లు మాట్లాడుకుని వచ్చాను.

"నందా మొన్న మెహతా ఖాళీచేసిన యిల్లు వీరికి కుదిర్చాను."

"మంచిది. వంట మనిషి కుదిరేవరకూ ఇక్కడికి రండి మహాశయా! ఏం మొహమాట పడవద్దు. భోజనంచేసి, అన్నయ్యతో కార్లో వెళ్ళిపోదురు " సునంద ఆహ్వానించింది వారి మాటను కాదనలేక వెళ్ళాను. వారి అభిమానానికి ఉక్కిరి బిక్కిరి అయిపోయాను. గోపాల్ బిజీమనిషి. సునందే కార్లోతిప్పి అన్నీకొనిపించింది. సర్దడానికి సాయం చేసింది నేను పని ముగించి త్వరగా వచ్చిన రోజు, చిన్నా, సునంద వెంబడి షికారుకు వెళ్ళేవాడిని.

* * *

త్వరగా డ్రస్సు వేసుకుని, నిలువుటద్దంలో మరోసారి చూచుకున్నాను ఈ మధ్య నా దుస్తులపై శ్రద్ధ చూపుతున్నాను. అదంతా సునంద మెప్పుకోసమంటే అతిశయోక్తి కాదేమో! ఆ రోజు చిన్నా పుట్టినరోజు. అయిదింటికి పార్టీ రమ్మనిచెప్పారు మరోసారి తలదువ్వుకొని చిన్నా కోసము కొన్న టాయస్ పాకెట్టు పట్టుకు వెళ్ళాను అప్పటికే హాలు కిటకిటలాడుతూంది.

'రా లక్ష్మణ్ .."గోపాల్ యెదురువచ్చి తీసుకెళ్ళి అందరికీ పరిచయము చేశాడు. "వీరు వీరాస్వామి మైసూరు వీరు కుమారన్ మద్రాసు నుండి వచ్చారు. వీరు బాలచందర్, సుకుమారన్, రస్సల్స్ అంతా కేరళ ...వీరు రంగనాధంగారని మన ప్రాంతవువారే."

అలాగే ఓ పదిమంది గుజరాతీలను పరిచయము చేశారు. ఆసాయంత్రంతా ఒకచోట చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు సునంద యెక్కడా కనిపించలేదు పనుపుగా ప్రక్క హాల్లోనుండి లోపలికి వెళ్ళాను చిన్నకి బొట్టు పెడుతూంది.

'నమస్తే' అన్నాను

'నమస్తే రండి త్వరగా వచ్చి సాయం చేస్తా రనుకుంటే అందరికంటే లేటా రావటం తెలిసింది లెండి ఈరోజు గంటసేపు అద్దం ముందు కూర్చుని ఉంటారు' అన్నది నావంక చూస్తూ. నిజంగా నా శ్రమ ఫలించినందుకు నన్ను నేను అభినందించుకున్నాను.

'మీరింకా ముస్తాబు కాలేదు పోనీ నన్ను సాయం చెయ్యమంటారా "

"కావియ్యండి జడ అల్లుతారా..."వెక్కిరిస్తూ చిన్నా అలంకరణ పూర్తిచేసింది.

'వీడిని అన్నయ్యకు అప్పగించి అతిధులకు చల్లని పానీయాలు ఇవ్వండి అయిదు నిముషాల్లో వచ్చేస్తాను" ఆమె బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది నేను చిన్నా బయటికి వచ్చాం.

పార్టీ ముగిసింది సునంద పాడుతుందని నాకు తెలియదు. కొందరు గుజరాతీలు బలవంతాన

"నాన్నా! డబ్బు సంగీతం పాడుతుందంటారు. మనకి వినిపించదేం?"

"మీ అమ్మ డబ్బుగొంతెత్తే కంటే ముందే, గొంతుపిసికి ఖర్చు పెట్టేస్తుంటుంది గా"

పాడించేరు చక్కగా శ్రావ్యంగా పాడింది. అందరూ అభినందించాక. నేను వెళ్ళి అభినందించాను.

'మీరు ఇంత బాగా పాడుతారని నాకు తెలియదు!"

'మీకు తెలియనివి చాలా ఉన్నాయి. ఆమె వరప్రసాదినోయ్. పాడుతుంది ఆటల్లో మనందర్నీ ఓడిస్తుంది చిత్రాలు గీస్తుంది వంటను మీరు రుచి చూచే ఉంటారు కుట్లూ అల్లికలూ ఒకటేమిటి?' ఒకతను అన్నాడు.

"చాల్లెండి మిస్టర్ రూపాణీ. మీ ఆవిడకు చెప్తాను."

"నే నిక్కడే ఉన్నాను నందా! నాకుతెలియదా " ఒక గుజరాతీ స్త్రీ ముందుకు వచ్చి సునంద భుజం చరిచింది. అందరూ ఆ చిన్నాని ఆశీర్వదించి వెళ్ళిపోయారు నేను వెళ్తానని లేచాను గోపాల్ ఆపాడు.

'నందా లక్ష్మణ్ భోజనం చెయ్యాలికదూ.."

'ఆఁ. వెళ్తానంటున్నారేమిటి?'

'ఇంకా కడుపులో చోటేది? అరువు కడుపు తెచ్చుకోవాలి."

'నే వస్తాలెండి." లోపలినుండి సమాధానం వచ్చింది. పనివారి సాయంతో అన్నీ సర్దించివేసి, తను గీసినచిత్రాలు చూపింది వారి కుటుంబముతో దినాలు క్షణాల్లా గడిచిపోతున్నాయి.

* * *

చిన్న ఊరూ - అక్కడి స్కూలును చూద్దామని వెళ్తుంటే ఒకచోట విచిత్రమైన దృశ్యము కంట బడింది. ఆవు ధమనులు నరాలు గంటుపెట్టి వాటి రక్తం త్రాగుతున్నారు. ఆ దృశ్యం చూడగానే నా కళ్ళు తిరిగిపోయాయి. వెనక్కు తిరిగాను నేను మాంసాహారినే. అయితే అంత హృదయాన్ని కలిచివేసే దృశ్యాన్ని చూడలేదు గదిలోకి వచ్చి నిదురపోదామన్నా కళ్ళముందు ఆ నగిషు బుర్రలోకి దుమికే రక్తమే కంటపడసాగింది వీరాస్వామి వచ్చి పిలిచాడు. టీ యిచ్చారు ఇంటికి వెళ్తాక.

'ఎలా ఉంది నైరోబీ"

'భగవంతుని దయవల్ల, గోపాల్‌గారి సహాయమువల్ల యింతవరకు ఇంటిపై అంత ధ్యాస పోవడంలేదు ' అన్నాను

'అయితే గోపాల్‌గారి మోసంలో నువ్వు పడ్డావన్నమాట " గంభీరంగా నవ్వాడాయన.

'అంటే?" ఆశ్చర్యంగా చూచాను.

'మనకెందుకు లెండి' వీరాస్వామి భార్య అంది.

'ఆయన మనలా మోసపోక ముందే హెచ్చరించుదాం అతను సహాయం చేసినట్టేచేసి, రేపటి నుండి మీదగ్గర డబ్బులాగుతాడు ఆ చెల్లెలు తెలివైన పిండం ఒక్కరోజులో నైరోబీలోని మొగాళ్ళనంతా దోచేస్తుంది"

'దానికి వచ్చే విద్యలేపాటోగాని ఆ గుజరాతీ మొగాళ్ళంతా దీని కొంగుచ్చుకుని తిరిగేవారే!" ఆడవారి కామెంట్

'నన్నేప్పుడూ అడగలేదండీ." అన్నాను.

'ముందు ముందు జాగ్రత్త." ఆలోచిస్తూ ఉండిపోయాను. ఆ సాయంత్రం ఎక్కడికీ వెళ్ళ బుద్ధి కాలేదు. అలవాటు ప్రకారం చిన్నను తీసుకుని సునంద వచ్చింది యెప్పటి నిష్కల్మషంగా మాట్లాడలేకపోయాను.

'ఎందుకంత గంభీరంగా ఉన్నారు?"

'ఏం లేదు కాస్త తల భారంగా ఉంది."

'అయితే వేడి కాఫీ యిందు" త్వరగా వెళ్ళి కాఫీ చేసి తీసుకువచ్చింది కాఫీ త్రాగుతుండగా సునంద తనొచ్చిన పని చెప్పింది.

'అన్నయ్య చెప్పాపెట్టకుండా టాంగానియా వెళ్ళాడు. కొంత డబ్బు సర్దగలరా? అన్నది వీరాస్వామి చెప్పిన విషయము గుర్తుకువచ్చింది. ఇవ్వవద్దనుకున్నాను. కాని ఒక్కసారిచ్చి, వారు చేసిన సాయం నుండి విముక్తి పొందాలనుకుంటిని ఆమె అడిగినంత యిచ్చాను

'టీ వీ చూద్దాం పదండి'

'ఈరోజు యెక్కడికీ రావాలని లేదు". ఆమె వెళ్ళిపోయింది విపరీతమైన అనుమానాలతో నా మనసు తికమకపడ సాగింది. మరు రోజు టీ త్రాగుతూ హోటల్లో కూర్చున్నాను రంగనాధం వచ్చాడు చాలాసేపు యిద్దరం మాట్లాడుకున్నాము.

'సాయంత్రాలు యెలా గడుపుతావు"

"గోపాల్ వాళ్ళ ఫ్యామిలితో షికారు వెళ్తాను."

'ఊఁ. వెళ్ళండి కాని. మీ జాగ్రత్తలో మీరుండండి. ఆ సునంద ఉండే అదో వ్యభిచారి దాని వగలు దాని కులుకు ఓహో నన్ను వలలో వేయాలని చూచింది. నేనా పడేది ఆ గుజరాతీ వాళ్ళంతా...నాకెందుకులే."

"నా కామె ప్రవర్తనలో లోపమేమీ కనిపించ లేదండీ! చాలా సాయం చేస్తారు "

'చేస్తారు తరువాత క్షవరము చేస్తారు ! ఆ చిత్రాలు అది గీసినవా ? దానికి బోలెడు మంది ప్రియులు." అన్నాడు. ఆ ప్రసంగము యిష్టం లేక, మరేదో మాట్లాడినాను. మరో యిద్దరు అలాగే చెప్పారు. కొంతయినా నిజములేనిది అందరూ యెందుకు చెబుతారు? ఏమయినా గోపాల్ ఫ్యామిలీతో పరిచయము తగ్గించా లనుకున్నాను. వారు చేసిన సహాయానికి నే నిచ్చిన డబ్బుకి చెల్లు అయింది. చెప్పుడు మాటలు విన్నప్పుడు విచక్షణ, విద్య అన్నీ మూలకు పోతాయి సునంద వచ్చే సమయము తెలుసు. వీరాస్వామి యింటికో, రంగనాథం యింటికో వెళ్ళిపోయేవాడిని. ఆదివారము ఉదయము పడక దిగకమునుపే సునంద ప్రత్యక్షం అయింది. 'అమ్మయ్య ఉన్నారా? యెన్నిసార్లు మీ యింటిచుట్టూ తిరిగాను మహాశయా ! అంత ముంచుకుపోయే పనులేం ఉన్నాయి ?

'ముంచుకుపోయే పనులు మీ ఆడవాళ్లు చేస్తారు. మేం కాదు ' అన్నాను నా వ్యంగ్యాన్ని అర్థం చేసుకోలేదు. ఎక ఎక నవ్వుతూంది.

'ఉన్నట్టుండి ఆడవారిపైకి దాడికివెడితేయెలా? పదండి. నాకు చాలా పనిఉంది క్రొత్తగా యెవరో ఢిల్లీనుండి వచ్చారట. మా యింటికి వస్తున్నారు" అన్నది.

"సారీ నాకు వీరాస్వామి యింట్లో భోజనముంది."

ఆమె నా వంక చిత్రంగా చూచింది.

'ఏం వెళ్ళకూడదా ?"

'వెళ్ళండి " ఆమె ముఖం గంభీరంగా మారిపోయింది. 'ఇదిగో ఆ రోజు తీసుకున్న డబ్బు. అన్నయ్య వచ్చిందగ్గరనుండి తేవాలనుకుంటూ, మిమ్మల్ని చూడలేకపోయాను " బల్లపైపెట్టి వెను తిరిగింది.

'తిరిగి తీసుకోవాలనే ఉద్దేశముతో నేను ఇవ్వ లేదు.'

"దానమిచ్చారా ?" ఆమె ముఖం ఎర్రబడింది. 'మిస్టర్ లక్ష్మణ్ ! మీరు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. ప్రొద్దుటే అబద్ధం ఆడారు...సరే వస్తాను. ఆమె వెళ్ళిపోయింది. తరువాత కాలకృత్యాలు తీర్చుకుని వీరాస్వామి యింటివైపు బయలుదేరాను. వారిపని కుర్రవాడువరండాలోకూర్చుని కూనిరాగం తీస్తున్నాడు నేను అడక్కుండానే సోది మొదలు పెట్టాడు.

'అమ్మగార్కి చాలా జబ్బుగావుంటే రాత్రి సునందమ్మగారు ఆస్పత్రికి తీసుకెళ్ళారు. ఈపూట బాబుగారి భోజనము అక్కడే " వాడు వచ్చీరాని ఇంగ్లీషులో ఏదో చెప్పాడు. నా ముఖంపై యెవరో


# ప్రగతి
## సచిత్రవారపత్రిక

## ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| కాజుయల్ కాలం సెం. మీ. | | రు. 4-50 |
| కాంట్రాక్టు ,, | ,, | 3-50 |

[ఒక సంవత్సరానికి 250 సెం. మీ. మరియు ఆపైన]
కనీసం 5 సెం. మీ × సింగిల్ కాలం

## రేపర్స్ : బ్యాక్ కవర్

| | ఒకసారి వేయడానికి | |
|---|---|---|
| ఒక రంగులో కాజుయల్ | ,, | రు. 375/- |
| కాంట్రాక్టు | ,, | రు. 325/- |
| రెండు రంగులలో కాజుయల్ | ,, | రు. 425/- |
| కాంట్రాక్టు | ,, | రు. 375/- |
| మూడు రంగులలో కాజుయల్ | ,, | రు. 475/- |
| కాంట్రాక్టు | ,, | రు. 425/- |

### రెండవ మరియు మూడవ రేపర్ ఒక రంగు

| | | |
|---|---|---|
| కాజుయల్ | ఒకసారికి | రు. 350/- |
| కాంట్రాక్టు | ,, | రు. 300/- |

### లోపలి పేజీలు

| | | |
|---|---|---|
| కాజుయల్ | ఒకసారికి | రు. 300/- |
| కాంట్రాక్టు | ,, | రు. 240/- |

మీ వ్యాపారాభివృద్ధికి ప్రగతి సచిత్రవార పత్రికను ఉపయోగించుకొన గోర్తాము.

## చందా రేట్లు

| | పోస్టుద్వారా | ఏజెంటుద్వారా |
|---|---|---|
| 3 మాసాలకు | రు. 5-20 | రు. 4-50 |
| 6 మాసాలకు | రు. 10-40 | రు. 9-00 |
| సంవత్సరానికి | రు. 20-80 | రు. 18-60 |

## ప్రగతి సచిత్ర వారపత్రిక
విశాలాంధ్ర బిల్డింగ్స్
మాచవరం : : విజయవాడ-4.

లాగి కొట్టినట్టు అయింది. నీరసంగా వెనుతిరిగి వచ్చాను.

మరో నాలుగురోజులు తప్పించుకు తిరిగాను. ఒంటరితనము బెబ్బులిలా వెంటపడింది. చిన్నా చిలిపిచేష్టలు గుర్తుకు రా సాగాయి. ఇక నిగ్రహించుకోలేక గోపాల్ ఇంటికి వెళ్ళాను. గోపాల్ యెటో వెడుతున్నాడు నన్నుచూచి చిరుగానవ్వాడు

'ఏం మనిషివయ్యా ఒకేసారి మాయం అయ్యావు? రంగనాథం కాలు బెణికింది. మనింట్లోనే ఉన్నాడు నేను ఓ గంటలో వచ్చేస్తాను. నందతో కబుర్లు చెబుతూవుండు ' ఆయన వెళ్ళిపోయారు హాల్లో అడుగుపెటి గదిలో నుండి వచ్చే మాటలు విని ఆగిపోయాను.

'వారి ప్రవర్తన నాకలా కనిపించలేదు రంగనాథంగారు." సునంద గొంతు

'సరి నేను చెబితే నమ్మరు. అతనికి బార్ గర్ల్సు సరిపోవటంలేదు. మీ వెంటపడి మీరు లొంగరని తెలుసుకుని నా యెదుట నానా మాటలన్నాడు ఈసారి అలాంటి ప్రస్తావన తెస్తే మర్యాద దక్కదన్నాను,"

'కాని ఒక్కనాడు అనుచితంగా ప్రవర్తించలేదు."

"అంతా దొంగవేషం, త్రాగుడు ఆటలు అయ్యో పూర్తిగా చెడిపోయాడండీ!'

"పోనివ్వండి. అతని ఖర్మ "

"మీది యెంత విశాలహృదయమండి అతను మిమ్మల్ని, గోపాల్‌గారిని అన్నమాటలు చెబితే '

'చెప్పొద్దులెండి. ఎవరి పాపం వారిది." నిజంగా ఆ క్షణంలో సభ్యత అడ్డు వచ్చిందిగాని అతన్ని చితకతన్నాలనిపించింది.

సునందకు ముఖం చూపించాలనిపించలేదు. వెనుతిరిగి వచ్చేశాను. యెంత ఆలోచించినా నాకర్థంగాని విషయమొక్కటే. రంగనాధం యెందుకంత అబద్ధం ఆడాల్సివచ్చింది. నేను త్రాగుబోతునని కాంతాలోలుడినని సునంద నమ్మితే? నమ్మనీ నాకేం, ఆమె నా బంధువు కాదు ... సరిపెట్టుకో చూచాను కాని మనసు యెదురుతిరిగింది. ఆనాడే మరో సత్యం తెలుసుకున్నాను. సునందపట్ల నాకు ...నాకు మరేదో భాషకందని భావము నా హృదిలో ఉందని.

రాత్రి ఏడుగంట లయింది. వంటవాడు బల్లపై అన్నీ అమర్చి వెళ్ళిపోయాడు. భోజనము చేద్దామని చేతులు కడుక్కుంటున్నాను. గల గల నవ్వుతూ సునంద వచ్చింది. వెనకాలే చిన్నా వచ్చాడు.

"భలే చిక్కు తెచ్చిపెట్టారండీ సాయంత్రం లక్ష్మణ్ మనింటికి వచ్చారు అంటా రన్నయ్యా రాలేదంటాను నేను. అరగంట వాదించుకున్నాక అర్థం అయింది అయ్యగారువచ్చి శ్రీరంగనాథంగారు చేయు నిందాలాపములు విని వెనక్కువచ్చారు అవునా?" సోఫాలో కూర్చుంది.

'అంతే .. సునందా ... నేను వారి మాటలు నమ్మి మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను ..." అతను చెప్పినవి చెప్పాలంటే ఉచితం అనిపించలేదు. నేను ఆమె కెదురుగా కూర్చున్నాను.

'నాకు తెలుసు లక్ష్మణ్‌గారూ మీరు నిజం కొన్నాళ్ళకయినా తెలుసుకుంటారు. నేను యెందుకు చెప్పాలని ఊరుకున్నాను.

'అంటే వారు అనేమాటలు తెలుసా "

"యెన్నాళ్ళు దాగుతాయి? అందరూ మాతో సాయంపొందె వెనకాల యెన్నో మాటలుఅంటారు నాకు తెలుసు. మంచివారని. సహాయం చేసి చనువుగా ఉంటే ప్రతివాడు నా శీలాన్ని శంకిస్తాడు "

'ఇంతా తెలిసికూడా మళ్ళా ఆ వెధవను యింట్లో యెందుకు పెట్టుకున్నారు?

'అది అన్నయ్య ఆజ్ఞ ఆయన ఈ సంకుచిత విషయాలకు అతీతుడు ఇప్పుడే యెవరో ముస్లింను - తీసుకువచ్చి గది ఏర్పాటు చేస్తున్నాడు '

'అంత సాయముపొంది వెనుకాల అలా మాట్లాడటానికి నాకు కారణము కనిపించదు "

'అసూయ అంటూ ఒకటి మనిషి హృదయములో బయలుదేరితే దానిముందు కారణము, మంచితనము వివక్షణ అన్నీ మాయమవుతాయి. అసూయ అంత చెడ్డది మరొకటి లేదండీ. అన్నయ్యకున్న ఎలుకుబడి హోదా చూస్తే. అసూయ నాకున్న ఆత్మవిశ్వాసం చూస్తే అసూయ, మనము చెడిపోయేదేం లేదు వారి అసూయలో వారే దగ్ధమవుతారు - పదండి రంగనాధాన్ని కాస్త ఏడ్పించాలి "

'అతని మాటలు నమ్మావా సునందా?'

'అతని మాటలేకాదు. ఎవరుచెప్పినా నమ్మను. వీరాస్వామికూడా యెన్నో చెప్పాడు. అవన్నీ పునర్విమర్శ చేసుకోటానికి తగిన మాటలు కావు. రండి". ఇరువురం లేచాము సునంద మాటను త్రోసివేయలేక వెళ్తున్నాను కాని నాకు సుతరామూ ఇష్టంలేదు కారు దిగి యింట్లో అడుగు పెట్టగానే గోపాల్ నా భుజం చరిచి నవ్వాడు.

భలేవాడివి మీట్ మై క్లోజ్ ఫ్రెండ్ లక్ష్మన్, ఇతనేమో రఫీ .." నూతన వ్యక్తితో చేతిని కలిపాను సోఫాలో కూర్చున్న రంగనాథాన్ని క్రీగంట పరీక్షించాను. అతని ముఖం చిట పటలాడుతూంది. అందరం కూర్చున్నాక సునంద వచ్చింది

'ముఖం అంత బాధగా పెట్టారు-కాలు నొప్పిగా ఉందా రంగనాధంగారూ?" నవ్వును బిగబట్టి అడిగింది.

'ఊఁ. " అన్నాడు. సునంద గోపాల్‌వైపు తిరిగింది.

'యెవరో దుర్మారులు నాపై ఉన్నవీ, లేనివి కల్పించి లక్ష్మణ్‌గార్కి చెప్పారట. నేను వేశ్యకంటే అన్యాయమట. మీరు ఆహ్వానించే అతిధులంతా నా కోసం వస్తారట వారిని మోసగించిన డబ్బుతోనే మీ వ్యాపారం నడుస్తుందట! ఇలాంటి మాటలు విని ఈ మహానుభావుడు నమ్మేశాడు అదే మీతో తేల్చుకుందాము అన్నదెవరో అడుగుదామని పిలుచుకువచ్చాను .." సునంద మాటలంటుండగా కెమెరా ఉంటే రంగనాధాన్ని ఫొటో తీయాల్సింది.

"మిస్టర్ గోపాల్ నేనీబాధభరించలేను. కాస్త డాక్టరు దగ్గరకు వెళ్లాలి. టాక్సీ తెప్పించు " రంగనాధం గీర కంఠంతో అరిచాడు

'ఏమిటి?' మాటలు అర్థంగాక రఫీ అడిగాడు ఇంగ్లీషులో.

'ఏం లేదు ఇతనికి కాలునొప్పి అధికంగా ఉంది నే నిప్పుడే డాక్టరుకు చూపించి వస్తాను " గోపాల్ రంగనాధాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు. సునందను చూచాను 'పాపం భోజనాలయ్యాక అనాల్సింది. ఇక రాడు' అన్నది

ఆమె అన్నట్టే అయింది. గోపాల్ ఒంటరిగా తిరిగి వచ్చాడు

'నీ గురించి ఆ మాటలన్నది అతనే నేమిటి? యెంత రమ్మన్నా ఇంటికివెడతానని పట్టుబట్టాడు "

'అవునన్నయ్యా శ్రీ లక్ష్మణ్‌గార్కి బార్ గర్ల్సుకి ఫ్రెండ్‌షిప్పట ఈయన త్రాగే సీసాలకి అంతేలేదట..." నా వంక కొంటెగాచూస్తూ అంది సునంద

గుడ్‌గాడ్ ఇంత గొడవ జరిగిందా లక్ష్మణ్ స్వయంగా చూచేవరకూ యెవరేం చెప్పినా నమ్మకోయ్ "

'ఒకే పొరపాటు పదే పదే చేస్తాముటండీ?" అన్నాను నవ్వుతూ. చాలా సేపటివరకూ పేకాడాం.

'ఇప్పుడు వదిలి వచ్చేందుకు ఓపికలేదోయ్ పడుకోరాదూ " నిజంగా సునందను ఆమె పరిసరాలను వదలి వెళ్ళాలని లేదు. నా కోసం తన గదిలో పడకవేసి అన్నగారి గదిలోకి పడక మార్చుకుంది.

'ఆ కూజాలో నీళ్ళుంటాయి ఆ ప్రక్కన బిస్కెట్లున్నాయి. అవి చిన్నావి.'

'నేను తినకూడదా ..'

'యెందుకు కూడదు? కావాలంటే బీరువాపై యింకా ఉన్నాయి."

'సునందా .." అస్పష్టంగాఉంది నా గొంతు.

'చెప్పండి".

"ఏం లేదు '

'దాటవేయక చెబుదురూ ..?"ఆమె కొంచెము దగ్గరగా వచ్చింది కిటికీలోనుండి వచ్చిన చల్లగాలి ఆమె ఒంటి సువాసనలు నా ముక్కుపుటాలవరకు తెచ్చింది.

"ఏం లేదు... నిజంగా నీ కోసమే యిక్కడికి వస్తున్నాను."

"బావుంది ..' నవ్వింది ఆమె బుగలు రాగరంజితముకావటం చూచాను.

'పడుకోండి ప్రొద్దుపోయింది. రేపు మాట్లాడవచ్చు " చిన్నగా నా భుజంతట్టి ముందుకు సాగింది ఆమె చేతిని అందుకుని గట్టిగా నొక్కి వదిలాను. వెనుతిరిగి మధురహాసము ఒలికించి ఒకటే పరుగుతీసింది.

రేపు ఈ విషయము ..అదే మేం ఇరువురము వివాహము చేసుకుంటామని చెబితే అప్పుడు అసూయాపరుల ముఖం యెలా వుంటుందో చూడాలి? సునంద గది ఆమె మంచము అనగానే ఒళ్లంతా పులకరించింది కలల్లో యెప్పుడు నిదుర పోయానో నాకే తెలియదు

★